క్లుప్తంగా

వాహనాల తనిఖీ

రామసముద్రం : వాహనాలకు అన్ని రకాల రికార్డులు సక్రమంగా లేకుంటే సీజ్ చేస్తామని మదనపల్లి ఆర్టీవో శివలింగయ్య తెలిపారు. శుక్రవారం రాత్రి ఆయన రామసముద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వాహనాలకు తప్పకుండా ఇన్సూరెన్స్, రూట్ పర్మిట్లు ఉండాలన్నారు. రికార్డులు లేని పది వాహనాలకు జరిమానా విధించగా, అందులో రెండు వాహనాలను సీజ్ చేశారు.

తైక్వాండో పోటీలకు ఎంపిక



తైక్వాండో పోటీలకు ఎంపికైన బాలికలతో పాఠశాల సిబ్బంది

ములకలచెరువు : స్థానిక కస్తూర్బా పాఠశాలకు చెందిన బాలికలు తైక్వాండో అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారని పీడీ రేష్మా శుక్రవారం తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 26 నుంచి 29 వరకు వెస్ట్‌బెంగాల్ కోల్‌కత్తాలో జరిగిన తైక్వాండో పోటీల్లో ముగ్గురు బాలికలు పాల్గొన్నారు. వారిలో ఇద్దరు బాలికలు రేఖా, ఐశ్వర్యలు అంతర్జాతీయా పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఓ శిల్పా, ఉపాధ్యాయులు, తోటి బాలికలు వారిని అభినందించారు.

పాత పెన్షన్ పునరుద్ధరించాలి

మదనపల్లె సిటీ : సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఏపీసీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఏపీసీపీఎస్ఈఏ -2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. 2004 సెప్టెంబర్ తర్వాత ప్రభుత్వ ఉద్యోగులుగా చేరిన ఉపాధ్యాయ,ఉద్యోగులకు వృద్ధాప్య పెన్షన్ కన్నా తక్కువ పెన్షన్ వస్తుందన్నారు. దీంతో ఎలా బతకాలన్నారు. అలాగే సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగులకు డీఏ, పీఆర్సీ బకాయిలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రంజిత్‌కుమార్, నరేష్‌కుమార్, కిల్లా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయం పెంచాలి



మాట్లాడుతున్న ఆర్టీసీ సీఐ రేవతి

మదనపల్లె సిటీ : ఆర్టీసీ సంస్థకు ఆదాయం పెంచాలని స్థానిక వన్ డిపో సీఐ రేవతి అన్నారు. శుక్రవారం స్థానిక డిపో కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా రాయచోటి, కదిరి, తంబళ్లపల్లె, కడప రూట్లలో ఆదాయం పెంచాలన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. వారితో మర్యాదగా మెలగాలన్నారు. ఆదాయం పెంచేందుకు సలహాలు, సూచనలు సిబ్బంది నుంచి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

గుర్రంకొండ : మండలకేంద్రంలో యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఎంఈఓలు సురేంద్రబాబు, సుబ్రమణ్యం చేతుల మీదుగా క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు వృత్తి పట్ల నిబద్ధతతో ఉండాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు భాస్కర్‌రెడ్డి, యూసూఫ్, గిరి, బాబు,చిన్నరెడ్డెన్న, షరీఫ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి(జగదాంబసెంటర్): అన్నమయ్య జిల్లాలో పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్(పీఎంఎఫ్ఎంఈ)రెసమర్థంగా అమలు చేసేందుకు జిల్లా పరిధిలో 30 మంది జిల్లా రీసోర్స్ పర్సన్(డీఆర్‌పీ)ల నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. 21 నుండి 30 సంవత్సరాలలోపు వయస్సు కలిగి, ఏదేని డిగ్రీ పూర్తిచేసి కంప్యూటర్, ఇంటర్నెట్ రంగంలో ప్రావీణ్యంగల వారంతా ఈ నెల 6వ తేదీలోగా దరఖాస్తు చేయాలన్నారు అర్హులన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాత పరీక్ష, ఇంటర్వ్యూలు ఈ నెల 8న ఉంటాయన్నారు.

5న హైందవ శంఖారావం

రామాపురం: ఈ నెల 5వ తేదీన విజయవాడలోని కేసరపల్లి లైలాగ్రీన్ మెడోస్ వద్ద నిర్వహించే హైందవ శంఖరావాన్ని విజయవంతం చేయాలని అన్నమయ్య జిల్లా విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు వీరారెడ్డి పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాలను హిందూ ధార్మిక సంస్థలకు అప్పగించాలని వీహెచ్‌పీ ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తోందన్నారు. హైందవ శంఖారావానికి లక్షలాదిగా హిందువులు తరలిరావాలని ఆయన కోరారు.

గుమ్మడి సాగు..ఆదాయం బాగు

- తోటల వద్దే వ్యాపారుల కొనుగోలు
- పొరుగు రాష్ట్రాలకు ఎగుమతులు



పొలంలో ఏపుగా పెరిగిన గుమ్మడికాయలు



గుమ్మడికాయలను లారీకి లోడింగ్ చేస్తున్న కూలీలు

మదనపల్లె సిటీ : రైతులు కొత్త పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. నికరంగా ఆదాయం వచ్చే వాణిజ్య పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. అతి తక్కువ ఖర్చుతో చేతికొచ్చే పంటలైన గుమ్మడి సాగు చేస్తూ నిరక ఆదాయం పొందుతున్నారు. మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల పరిధిలో రైతులు ఈ ఏడాది గుమ్మడి సాగ చేపట్టారు. సుమారు 500 ఎకరాల్లో రైతులు గుమ్మడి పంట సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట పలు చోట్ల కోతదశలో ఉండగా, మరికొన్ని చోట్ల పూత దశలో ఉంది. వ్యాపారులు తోట వద్దకే వచ్చి కాయలు కొనుగులు చేస్తున్నారు. కాయలను పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి.

ఎకరాకు రూ. 10 వేలు ఖర్చు:

రైతులు గుమ్మడి విత్తనాలను కర్ణాటక రాష్ట్రం చింతామణి నుంచి తెప్పించుకుంటున్నారు. ఎకరాకు 6 ప్యాకెట్లు చొప్పున అవసరమవుతాయి. ఒక్కో ప్యాకెట్ రూ.550 (200 గ్రాములు) ఉంటుంది. పొలంలో ఐదు అడుగులకు ఒక సాలు ఏర్పాటు చేసి ఒక అడుగు దూరంలో గుమ్మడి విత్తనాలను నాటుకోవాలి. విత్తనం నాటిన పదిహేను రోజులకు మొక్క సత్తువ కోసం మొదళ్లల్లో యూరియా, డీఏపీ వేయాలి. అనంతరం సాళ్ల మధ్యలో గడ్డి మెలవకుండా రోటోవేటర్ ఉపయోగించి భూమిలో ఉన్న తేమను బట్టి డిప్పును ద్వారా నీరు అందించాలి. ఒక నెలకంతా తీగజాతికి చెందిన గుమ్మడి పొలం మొత్తం అల్లుకుంటుంది. పూతకు మాత్రం తెగుళ్లు సోకకుండా మందులు పిచికారీ చేయాలి. నాటిన మూడు నెలలకు సరిగ్గా పంట కోతకు వస్తుంది. ఎకారకు విత్తనం నాటడం, ఎరువుల దగ్గర నుంచి పంట కోసే కూలీల వరకు సరాసరిగా రూ.10వేల నుంచి రూ.12 వేలు వరకు ఖర్చు వస్తుంది.

ఎకరాకు 10 టన్నుల దిగుబడి:

తీపి గుమ్మడి భూమి స్వభావం, సత్తువ, వాతావరణ అనుకూలతలను బట్టి ఎకరాకు 7 నుంచి 10 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఒక్కో గుమ్మడి కాయ కనీసం 2 కిలోల నుంచి 5 కిలోల వరకు ఉంటుంది. కాయలు త్వరగా పాడవ్వకుండా దిగుబడి వచ్చిన తర్వాత పదిహేను నుంచి ఇరవై రోజుల వ్యవధిలో మార్కెట్‌లో మంచి ధరలు ఉన్నప్పుడు చూసి కోసుకోవచ్చు. పంట మొత్తం ఒకేసారి కటింగ్ చేయాల్సి ఉంటుంది.

మార్కెట్‌లో టన్నుకు రూ.6 వేలు:

గుమ్మడి ధర మార్కెట్‌లో టన్ను రూ.6 వేల వరకు పలుకుతోంది. ధరలు ఎంత తక్కువన్నా టన్ను రూ.3వేలు పోయినా రైతు పెట్టుబడికి ధోకా ఉండదు.

పొరుగు రాష్ట్రాలకు ఎగుమతులు:

ఇక్కడ పండించిన గుమ్మడిని తమిళనాడు, కర్ణాటక, కలకత్తా, ఒరిస్సా, ఉత్తర ప్రదేశ్‌లకు ఎగుమతి అవుతన్నాయి. వ్యాపారులు నేరుగా తోటల వద్దకు వచ్చి రైతులతో ఒప్పందం కుదుర్చుకుని కొనుగోలు చేస్తున్నారు. సంక్రాంతి పండగ వస్తుండటంతో మంచి డిమాండ్ ఏర్పడింది. వరుసగా శివరాత్రి, ఉగాది పండుగలు వస్తుండటంతో గుమ్మడికి డిమాండ్ ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు.ఈ గుమ్మడిని స్వీట్లు, హల్వా తయారీకి ఎక్కువ వాడుతారు.

తక్కువ ఖర్చుతో ఆదాయం



ఐదేళ్లుగా గుమ్మడి సాగు చేస్తున్నా. రెండున్న ఎకరాల్లో 31 టన్నుల దిగుబడి వచ్చింది. టన్ను రూ.6 వేలు పలికిందివ. 31 టన్నులకు సరాసరి రూ.1.80 లక్షలు వచ్చింది. రెండున్నర ఎకరాలకు రూ.30 వేలు పెట్టుబడి పోగా రూ.150 వరకు ఆదాయం వచ్చింది. తక్కువ ఖర్చుతో మంచి ఆదాయం పొందవచ్చు. ప్రభుత్వం రాయితీలు అందించాలి.

– ప్రభాకర్, రైతు, పల్లికుంటపల్లె, తంబళ్లపల్లె మండలం.

నేడు ఉచిత వైద్యశిబిరం

పీలేరు : స్థానిక చిత్తూరు మార్గంలోని ఇందిరమ్మ కాలనీలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు దళవాయి సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తిరుపతి రమాదేవి సూపర్ స్పెషాలిటీ వైద్యులు శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేషన్ సరుకులు సకాలంలో పంపిణీ చేయాలి

తంబళ్లపల్లె : కార్డుదారులకు రేషన్ సరుకులను సకాలంలో పంపిణీ చేయాలని ఎన్‌ఫోర్సుమెంట్ డీటీ భువనేశ్వరి అన్నారు. శుక్రవారం మండలంలోని పలు చౌకదుకాణాలను తనిఖీ చేశారు. స్టోర్ రికార్డులతో పాటు కార్డు దారులకు పంపిణీ చేస్తున్న బియ్యం, సరుకుల నాణ్యత,, తూనికలు, బియ్యం నిల్వల తదితరాలను తనిఖీ చేశారు. కార్డుదారులతో మాట్లాడి ప్రతి నెల రేషన్ సరుకులు సకాలంలో పంపిణీ చేస్తున్నారా? సరుకు నాణ్యత ఎలా ఉంది? అన్న విషయాలు ఆరా తీశారు. రేషన్ డీలర్లు, ఎండీయూ నిర్వాహకులు సమన్వయంతో కార్డుదారులకు సకాలంలో రేషన్‌సరుకులు పంపిణీ చేయాలన్నారు. రేషన్ పంపిణీలో ఏవైనా సమస్యలు తలెత్తితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వీఆర్ఓలు,రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

- సూపర్ సిక్స్ ఎగవేత ధోరణిలో కూటమిప్రభుత్వం
- సంపద సృష్టితో అత్యంత ధనిక ముఖ్యమంత్రిగా చంద్రబాబు
- తల్లికి వందనం అమలుచేయకపోవడంతో రూ.13,112 కోట్ల నష్టం
- సంక్షేమాన్ని కేలండర్ మాదిరిగా అందించి ఆదర్శంగా నిలిచిన జగన్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె : హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పింది ఏదీ చేయరని, ఆయన మాటలన్నీ మోసం...పాలన మోసమేనని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... శుక్రవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో సూపర్‌సిక్స్ హామీల అమలుపై శుభవార్త వింటామని ఎదురుచూసిన ప్రజలకు చంద్రబాబు నిరాశే మిగిల్చారన్నారు. కూటమిప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల్లో కేవలం పెన్షన్ పథకం తప్ప మరే హామీల అమలు జరగలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమాన్ని కేలండర్ మాదిరిగా అందించి దేశానికే ఆదర్శంగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తుంటే, అప్పటి ప్రతిపక్షనాయకులైన కూటమిపెద్దలు అసత్యాలు ప్రచారం చేశారన్నారు. రాష్ట్రం అప్పుల పాలైందని, శ్రీలంక, సోమాలియా అయిపోతోందని పదేపదే అబద్ధాలు చెప్పారన్నారు. సంక్షేమం కోసం గత పాలకుడు అప్పుచేస్తే తప్పన్న వారు...ఇవాళ సంక్షేమం ఇవ్వకుండానే రూ.1లక్ష19వేల కోట్లు అప్పులు చేయడం తప్పు కాదా అని ప్రశ్నించారు. కేవలం 2 ఎకరాల భూమితో రాజకీయాల్లోకి వచ్చిన చంద్రబాబు.. రూ.931 కోట్ల ఆస్తులతో ఏకంగా దేశంలోనే అత్యంత ధనిక ముఖ్యమంత్రిగా ఎదగడం వెనుక సంపద సృష్టి ఎలా జరిగిందో పేద ప్రజలకు తెలపాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తల్లికి వందనం కింద స్కూల్ వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15వేలు ఇస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు 2024లో ఒక రూపాయి ఇవ్వకపోగా, 2025 జూన్‌లో ఇస్తానని చెప్పడం ఆయన మాట మీద నిలబడరనేందుకు నిదర్శనమన్నారు.

తల్లికి వందనం ఎప్పుడు?

ఒక ఏడాది తల్లికి వందనం అమలుచేయకపోవడం వల్ల రాష్ట్రంలోని 87.42లక్షల మంది విద్యార్థులకు ఒక ఏడాదే రూ.13,112 కోట్లు నష్టపోయారన్నారు. వైఎస్.జగన్ పాలనలో 12శాతం జీఎస్టీ గ్రోత్ రేట్‌తో రాష్ట్రం ఉంటే, చంద్రబాబు అధికారంలోకి వచ్చాక 6 శాతానికి పడిపోయిందన్నారు. బాబు కుటుంబ ఆస్తులు మాత్రం కొండల్లా పెరిగిపోతుంటే, రాష్ట్ర ఆదాయం మాత్రం తగ్గిపోతోందన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం ఏదీ?

కూటమిప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుచేయలేదు అనడానికి ప్రజలే సాక్ష్యమని, రైతులను కూటమి ప్రభుత్వం నిలువునా మోసం చేసిందన్నారు. 54లక్షల మంది రైతన్నలకు ఏటా రూ.20వేల చొప్పున పెట్టుబడి సాయం అందకపోవడంతో రూ.10వేల కోట్ల మేర నష్టపోయారన్నారు. కూటమిప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో అగ్రగామిగా ఉంచేందుకు ప్రయత్నిస్తోందే తప్ప ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలన్న ఆలోచనలో లేదన్నారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబు మాయమాటలు నమ్మి సంక్షేమ ప్రభుత్వాన్ని ఓడించుకున్నామన్న ఆవేదనతో ప్రజలు ఉన్నారని, కూటమిప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరచి హామీలు నిలుపుకునేందుకు కృషి చేయాలన్నారు. ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తూనే ఉంటుందని, ప్రజలకు జవాబుదారీగా ఉంటుందని చెప్పారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



పెద్దమండ్యం : వినతులను స్వీకరిస్తున్న తహసీల్దార్



పీలేరు: రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు



గుర్రంకొండ : అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

పీలేరు రూరల్ : రెవెన్యూ గ్రామ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రత్యేకాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్. రమ అన్నారు. శుక్రవారం మండలంలోని గూడరేవుపల్లె, జాండ్ల పంచాయతీకి సంబంధించి గూడరేవుపల్లె గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సదస్సులో మొత్తం 70 అర్జీలు వచ్చాయని, అందులో 60 భూసమస్యలు, మిగిలి ఇతర సమస్యలపై వచ్చినట్లు తెలిపారు. ప్రతి అర్జీ ఆన్‌లైన్ చేసి గడువులోపు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు, నోడల్ ఆఫీసర్ భరత్‌కుమార్‌రెడ్డి, సర్వేయర్ కిరణ్మయి, వీఆర్వో హేమంత్ నాయక్ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వెల్లువెత్తిన అర్జీలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని సంపతికోటలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి అర్జీలు వెల్లువెత్తాయి. గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య వైఖరితో తాము నిత్యం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దౌర్భాగ్య స్థితి నెలకొందని రైతులు వాపోయారు. ఒకరి భూములు ఇంకొకరికి, తమ భూములకు సంబంధించి వేరేవాళ్ల ఆధార్ నంబర్లు ఇలా ఇష్టారాజ్యంగా నమోదు చేశారని రైతులు అసహనం వ్యక్తం చేశారు.

పట్టాల కోసం రైతుల వినతి

పెద్దమండ్యం : ఎంతో కాలంగా తాము సాగుచేసుకుంటున్న భూములకు డీ పట్టాలు, పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని తహసీల్దార్ సయ్యద్ అహ్మద్‌కు రైతులు వినతి చేశారు. మండలంలోని గుడిశవారిపల్లె ప్రాథమిక పాఠశాల వద్ద గ్రామ సర్పంచ్ పీరాన్‌బి అధ్యక్షతన శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజల నుండి తహశీల్దార్ వినతులను స్వీకరించారు. వారసత్వంగా తాము సాగుచేసుకుంటున్న భూములకు డి పట్టాలు, పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని గురివిరెడ్డిగారిపల్లె, పి తురకపల్లె, గుడిశవారిపల్లెలకు చెందిన రైతులు కోరారు. పింఛన్లు, ఇతర సమస్యలపై అధికారులకు ప్రజలు అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో వీర్‌వో నవాజ్‌బాషా, పంచాయతీ కార్యదర్శి జనార్దన్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు పరిష్కారం

బి.కొత్తకోట : రెవెన్యూ సదస్సుల్లో అందే సమస్యలకు పరిష్కారం చూపుతామని తహసీల్దార్ మొహమ్మద్ అన్సారీ అన్నారు. శుక్రవారం మండలంలోని కోటావూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వివిధ సమస్యలపై 22 ఫిర్యాదులు అందాయి. వీటిని పరిశీలించిన అధికారులు నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరిస్తామని రైతులకు చెప్పారు. సర్వేయర్ ముబారక్, వీఆర్ఓ వరదరాజులు పాల్గొన్నారు.

భూ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం

గుర్రంకొండ : భూ సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని రాయచోటి డీఎల్‌డీవో, మండల నోడల్‌ఆఫీసర్ లక్ష్మీపతి అన్నారు. శుక్రవారం రామాపురం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు పలు రెవెన్యూ సమస్యలపై అధికారులకు అర్జీలు సమర్పించారు. గ్రామంలో పొలాలకు వెళ్లే దారులను కొంతమంది ఆక్రమించుకొన్నారని రైతులు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ శ్రీనివాసు లు, సర్పంచ్ కొండేటి ఆనంద్, పంచాయతీ కార్యదర్శి మణీ, విఆర్వో సంజీవనాయక్ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి

మదనపల్లె : క్షేత్రస్థాయిలో బీజేపీని బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని మాజీ ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మండల కన్వీనర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశంలో వేగవంతంగా మార్పులు జరుగుతున్నాయన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు పెద్ద సంఖ్యలో జరుగుతోందన్నారు. రాష్ట్ర పరిస్థితులు వేరేగా ఉన్నాయన్నారు. పరిపాలనను చూసిన తర్వాత ప్రజలు బీజేపీ వైపు ఆకర్షితులవుతారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శులు యల్లంపల్లె ప్రశాంత్, ఆకులకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

నిమ్మనపల్లె : వాహనానికి సంబంధించిన లీజు డబ్బులు అడిగితే తనను అసభ్య పదజాలంతోను, కులం పేరుతోను దూషించారని మండలంలోని రెడ్డివారి పల్లి పంచాయతీ చలిమామిడి పల్లెకు చెందిన జింక సహదేవ కుమారుడు అశోక్ కుమార్ శుక్రవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అశోక్ కుమార్ వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేసిన టిప్పర్ వాహనాన్ని మదనపల్లి రమేష్ నాయుడుకు నెలకు రూ.1,25,000 చొప్పున లీజు అగ్రిమెంట్ చేసుకున్నారు. రమేష్ నాయుడు లీజు డబ్బులు సక్రమంగా చెల్లించలేదు. లీజు నగదు విషయమై 18.09.2024 వ తేదీన రమేష్ నాయుడు వ్యవసాయ పొలం వద్ద ఉండగా అశోక్ కుమార్ అక్కడికి వెళ్లి, టిప్పర్ లీజు డబ్బులు అడగడంతో అతడు నానా దుర్భాషలాడి కులం పేరుతో దూషించాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అప్పటి నుంచి పలుమార్లు ఇదే విషయమై అతనితో సంప్రదించిన ఫలితం లేకపోవడంతో శుక్రవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇంచార్జ్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

మహిళా చైతన్య దీప్తి సావిత్రిబాయి పూలే

- చదువే జీవిత ఉన్నతమార్గం
- 194వ జయంతి ఉత్సవాల్లో పూలే స్మారక పురస్కారాలు



హెచ్‌ఎం ముంతాజ్‌బేగంకు సావిత్రిబాయి పూలే పురస్కారాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : మహిళల అభివృద్ధికి పాటుపడిన మొట్టమొదటి బహుజన మహిళ, భారతదేశ తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే మహిళా చైతన్య దీప్తి అని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. సావిత్రిబాయి పూలే 194వ జయంతి సందర్భంగా పట్టణంలోని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పలు విద్యాసంస్థల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బహుజన సేన వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ చందు ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముఖ్యఅతిథిగా హాజరై మహిళామూర్తులను సత్కరించి, పురస్కారాలను అందజేశారు. పురస్కారాలు అందుకున్న వారిలో నాగరత్న, వి.సుజాత, రమాదేవి, ఏ.రమాదేవి, డాక్టర్.అనూరాధ, డాక్టర్.రాధిక, ఏ.రామక్క, వెలుగు భాగ్యలక్ష్మి, పోర్డ్ లలితమ్మ, కవిత, కమిషనర్ కే.ప్రమీల, లెక్చరర్ మోహనవల్లి, నిమ్మనపల్లె జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం ముంతాజ్‌బేగం తదితరులు ఉన్నారు.

బహుజన యువసేన(బీవైఎస్) ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయులకు సన్మానసభ నిర్వహించారు. ప్రిన్సిపాల్ సురభిరమాదేవిని విద్యార్థినుల మధ్య ఘనంగా సన్మానించారు.

చిరస్మరణీయురాలు సావిత్రిబాయి పూలే

బి.కొత్తకోట: వందల ఏళ్ల క్రితమే మహిళల విద్యకు పునాది వేసిన సావిత్రిబాయి పూలే చిరస్మరణీయురాలని ఎంఈవో ఆర్.రెడ్డిశేఖర్ అన్నారు. ఆమె జయంతి సందర్భంగా స్థానిక భారత్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తరతరాల అణచివేత, మహిళల్లో ఆత్మస్థైర్యం కల్పించి మార్పు తీసుకురావడంలో విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ పూజారి శ్రీనివాసులు, బాస్ నాయకులు సచిన్, సింగన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు నక్కా మహేష్, ఎమ్మార్సీ సిబ్బంది ఉబేదుల్లా పాల్గొన్నారు.

మైనారిటీ గురుకుల పాఠశాలలో..

కలికిరి (వాల్మీకిపురం) : వాల్మీకిపురం పట్టణ పరిధిలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జనవి/జ్ఞాన వేదిక అధ్యక్షుడు ప్రభుచరణ్ మాట్లాడుతూ స్త్రీల విద్యతోనే సమాజంలో సగౌరవం దక్కుతుందని, 1848 జనవరి 1న మొదటి సారిగా పూణేలో బాలికల పాఠశాలను ప్రారంభించి నాంధి పలికారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమామంజుల, ఉపాధ్యాయులు లోకనాథం, ఖాజాబీ, బాబాజాన్, హుస్సేన్, రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

రామసముద్రం : మండలం కేంద్రంలోని విద్యా శాఖ కార్యాలయంలో శుక్రవారం సావిత్రి బాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యం అని నమ్మి భర్త అడుగుజాడల్లో నడిచి, సామాజిక న్యాయం కోసం, అణగారిన వర్గాల కోసం, మహిళల హక్కుల సాధన కోసం కృషిని మహనీయురాలు సావిత్రి బాయి పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో సీఆర్పీ లు దామోదర్, సుధాకర్ రెడ్డి హరి, రామాంజులు, నాగరాజు, అనిత, అన్వేష్, శీన పాల్గొన్నారు.

పీలేరులో..

పీలేరు : స్థానిక ప్రభుత్వ పాఠశాలలో, అంబేడ్కర్ సర్కిల్ వద్ద వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మహిళల విద్యాభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. మహిళా హక్కులే మానవ హక్కులు అని సావిత్రి బాయి పూలే నినాదం మరువలేనిదన్నారు. మహిళాశక్తికి ఆమె ఒక నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి, హెచ్‌ఎం నటరాజన్, వివిధ సంఘాల నాయకులు టి. ధరణికుమార్, పాలకుంట శ్రీనివాసులు, బలరాం తదితరులు పాల్గొన్నారు. అలాగే బహుజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రి బాయిపూలే జయంతి ఘనంగా నిర్వహించారు.

మహిళలకు ఆదర్శం

కలకడ : మహిళలకు ఆదర్శం సావిత్రిబాయి పూలే అని కోన క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు మొడెం చెంగల్‌రాయుడు అన్నారు. శుక్రవారం కోన ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని పాఠశాలలోని మహిళ ఉపాధ్యాయునులను సన్మానించారు. సమాజంలో రుగ్మతులను తొలగించడానికి సావిత్రబాయిపూలే చేసిన కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేశ్వరి, నాగమునినాయక్, రమేష్ కుమార్‌రెడ్డి, రెడ్డెప్ప, గఫార్‌ఖాన్, సైరాబాను, ఝాన్సీరాణి, కిరణ్‌కుమార్, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



బహుజన యువసేన ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ రమాదేవికి సత్కారం



మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

తప్పిపోయిన చిన్నారి అప్పగింత



చిన్నారిని అప్పగిస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్

కలికిరి (వాల్మీకిపురం) : తప్పిపోయి ఏడుస్తూ తిరుగుతున్న చిన్నారిని పోలీసులు అక్కున చేర్చుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసుల కథనం మేరకు.. నిమ్మనపల్లి మండలం తవళం గ్రామానికి చెందిన సరస్వతి తన భర్త, కుమార్తె రెడ్డి మోక్షితతో కలిసి చికిత్స నిమిత్తం వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి వచ్చింది. కుమార్తెను ఆసుపత్రిలోనే భర్త దగ్గర వదిలి చికిత్స వైద్యుల వద్దకు వెళ్లింది. చిన్నారి రెడ్డిమోక్షిత ఆడుకుంటూ తండ్రి నుంచి దూరంగా వెళ్లి దిక్కుతెలియని స్థితిలో ఏడుస్తూ రోడ్డుపైకి వచ్చేయగా గమనించిన స్థానికులు సమీపంలోకి పోలీసులకు అప్పగించారు. ప్రభుత్వాసుపత్రికి చేరుకుని విచారించిన పోలీసులు పాప తల్లి శస్త్ర చికిత్స చేయించుకుంటోందని, పాపకు చిన్నమ్మ అయిన సోనియాకు అప్పగించారు.